సాక్షి కామారెడ్డి

గురువారం | 2 | జనవరి | 2025



నిధులే అడ్డంకి..

బాన్సువాడలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణ పనులు నిధులు లేక మధ్యలోనే నిలిచిపోయాయి.

- 9లో ▸



ప్రభుత్వం స్పందించకపోవడం..

డిమాండ్‌లను నెరవేర్చాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 23వ రోజూ కొనసాగింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
29.5 /14.3

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన పోచారం



బాన్సువాడ: ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏఎస్పీ




కామారెడ్డి క్రైం: అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఏఎస్పీ) చైతన్యరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలతో సమావేశమయ్యారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రతి ఒక్కరూ చట్ట ప్రకారం నడుచుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించే వారిని సహించేది లేదన్నారు. పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సైలు నూతన ఏఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అర్చరీ పోటీల్లో దోమకొండ క్రీడాకారిణి ప్రతిభ



దోమకొండ: రాష్ట్ర స్థాయి సీఎం కప్ అర్చరీ పోటీల్లో దోమకొండకు చెందిన క్రీడాకారిణి కదిరె సింధూజ ప్రతిభ చూపి సిల్వర్ మెడల్ సాధించినట్లు అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ తెలిపారు. ఖమ్మంలో సోమవారం జరిగిన ఫైనల్ పోటీల్లో ఆమె సత్తా చాటి పతకం సాధించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సింధూజను అర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు తిర్మల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి తదితరులు అభినందించారు.

110 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు



కామారెడ్డి క్రైం: జిల్లాలో మంగళవారం 110 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని ఎస్పీ సింధు శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 66 వాహనాలను సీజ్ చేశామని పేర్కొన్నారు. కామారెడ్డి సబ్ డివిజన్‌లో 60, ఎల్లారెడ్డి పరిధిలో 28, బాన్సువాడ పరిధిలో 22 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని తెలిపారు. రోజూ తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు రహదారి భద్రత నియమాలను పాటించాలని, ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.

నేడు ఏకసభ్య కమిషన్ రాక

నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ గురువారం నిజామాబాద్‌కు రానుంది. ఉప వర్గీకరణ, వివరణాత్మక అధ్యయనం కోసం గురువారం ఉదయం 11 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి(కలెక్టరేట్) చేరుకుంటారని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్‌తో కూడిన ఏక సభ్య కమిషన్‌కు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని ఎస్సీ కులానికి చెందిన ప్రజాప్రతినిధులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వైద్యులు, షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు, ఇతర ఉద్యోగులు, ఎస్సీ కులానికి చెందిన అన్ని వర్గాల వారు హాజరై ఏకసభ్య కమిషన్‌కు తమ వినతులు అందజేయాలని సూచించారు.



వివాదాలకు కేరాఫ్.. వందేళ్ల ఠాణా!



- అంతటా బీబీపేట పోలీస్ స్టేషన్ గురించిన చర్చ
- గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్సైల చుట్టూ వివాదాలు
- ముగ్గురి మరణాల మిస్టరీతో మరోసారి తెరపైకి..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బీబీపేట ఠాణా.. ఇది నిజాం కాలంలో 1927 లో ఏర్పాటైన పోలీస్ స్టేషన్. ఆ కాలంలో నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనం శిథిలమైపోగా ఈ మధ్యే పూర్తిగా తొలగించారు. కొంత కాలం పాత పంచాయతీ భవనంలో ఉన్న ఈ ఠాణా.. ప్రస్తుతం సొంత భవనంలో కొనసాగుతోంది. కాగా ఇటీవల మిస్టరీగా మారిన అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో ముగ్గురి మృతదేహాలు లభించిన కేసుతో బీబీపేట ఠాణా మరోమారు వార్తల్లో నిలిచింది. ముగ్గురు మృతుల్లో ఒకరైన మహిళా కానిస్టేబుల్ శ్రుతి చనిపోయే వరకు ఇదే స్టేషన్‌లో విధులు నిర్వహించింది. మరో మృతుడు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ 2022 ఏప్రిల్ 13 నుంచి 2023 జూలై 31 వరకు ఈ పోలీస్ స్టేషన్‌లోనే పనిచేశారు. మూడో మృతుడు నిఖిల్ బీబీపేట వాస్తవ్యుడు. ఆ స్టేషన్‌లో కంప్యూటర్లకు అవసరమైన మరమ్మతులు చేసేవాడు. ఇలా ముగ్గురు మృతులకు బీబీపేట పోలీస్ స్టేషన్‌తో అనుబంధం ఉంది.

మూడు దశాబ్దాల నాడు నక్సల్స్ దాడి

1996 లో బీబీపేట పోలీస్ స్టేషన్ భవనంపై పీపుల్స్ వార్ నక్సల్స్ దాడి చేశారు. మైన్స్ పెట్టి పేల్చేందుకు యత్నించారు. ఈ దాడిలో పోలీస్ స్టేషన్ కొంత భాగం దెబ్బతింది. ఎవరికీ ఎలాంటి అపాయం జరగలేదు. తర్వాత కొంతకాలం పోలీస్ స్టేషన్‌ను భద్రతరీత్యా దోమకొండకు తరలించారు. దోమకొండ నుంచే బీబీపేట ఠాణా కార్యకలాపాలు కొనసాగాయి. కొత్త భవనం నిర్మించిన తర్వాత కొంత కాలానికి పోలీస్ స్టేషన్‌ను బీబీపేటకు తరలించారు.

దశాబ్దంలో 13 మంది..

బీబీపేట పోలీస్ స్టేషన్‌లో పదేళ్ల కాలంలో 13 మంది ఎస్సైలు అక్కడ పనిచేశారు. అందులో కొందరు ఏడాది, రెండేళ్లు పనిచేయగా మరికొందరు నెలలే పనిచేశారు. ఇందులో ఇద్దరు ముగ్గురు అధికారులు వ్యక్తిగత విషయాల్లో చెడ్డ పేరు తెచ్చుకున్నారు. తన భర్త వేరే మహిళతో ఉంటూ తనకు, తన పిల్లలకు అన్యాయం చేస్తున్నాడని నల్గొండ జిల్లాలో ఓ ఎస్సై భార్య ఇటీవల ఆందోళనకు దిగింది. సదరు ఎస్సై 2020 నుంచి 2022 వరకు బీబీపేట పోలీస్ స్టేషన్‌లోనే పనిచేశాడు. ఇక్కడ పని చేసినప్పటి నుంచే భార్యాభర్తల మధ్య గొడవ నడుస్తున్నట్లు తెలిసింది. సామాజిక మాధ్యమాల్లో ఆ ఎస్సై భార్య ఆందోళనకు సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. అంతకుముందు కూడెల్లి వాగు ఇసుక దందా వ్యవహారంలో ఇద్దరు ముగ్గురు ఎస్సైలపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అప్పట్లో పోలీసు సిబ్బంది కూడా పలువురు వివాదాల్లో ఇరుక్కున్నారు.

● కొత్త ఆశలతో..



ఇసన్నపల్లి(రామారెడ్డి)లో కాలభైరవుడి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

జిల్లాలో బుధవారం ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు కేక్ కట్ చేసి, టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఉదయం ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి 2025కు స్వాగతం పలికారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

'రహదారి నిబంధనలు పాటించాలి'



ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

భిక్కనూరు: వాహనదారులు రహదారి భద్రత నిబంధనలను పాటించాలని జిల్లా రవాణా శాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. వాహనదారులు ఫోర్‌వీలర్లు నడిపేవారు సీట్ బెల్ట్, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలను ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలను నడిపించే వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని రవాణా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: తెలంగాణ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం (టీజీపెటా) జిల్లా కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. కామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. అధ్యక్షుడిగా మధునాల స్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శిగా పి.అశోక్, కోశాధికారిగా ఆర్.శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా సంగారెడ్డి ఎన్నికయ్యారని సంఘం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు హీరాలాల్, సాయి మౌర్య, నర్సింహారెడ్డి, లింగం, సురేశ్, నాగరాజు, వీరేశం పాల్గొన్నారు.

నలుగురికే వేతనాలు ఎలా పెంచారు?



మున్సిపల్ వాటర్‌వర్క్స్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

- అధికారులను ప్రశ్నించిన కార్మికులు
- సీఐటీయూ నేతలను నిలదీసిన తోటి కార్మికులు

కామారెడ్డి టౌన్: మున్సిపల్ వాటర్‌వర్క్స్ కార్యాలయం ఎదుట బుధవారం ఉదయం కార్మికులు ఆందోళనకు దిగారు. విధులకు వెళ్లకుండా అక్కడే బైఠాయించి రెండు గంటల పాటు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మిక సంఘం సీఐటీయూ నాయకులు తోటి కార్మికులకు మోసం చేశారని విమర్శించారు. నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నా పట్టించుకోవడం లేదని అన్నారు. 30 ఏళ్లకు పైగా సీనియారిటీ ఉన్న కార్మికులను కాదని, సీఐటీయూ అనుబంధ నాయకులు రాజనర్సు, ప్రభాకర్, ప్రభు, కిరణ్‌లకు మాత్రమే రూ.20,500లకు వేతనాలు పెంచుతూ అధికారులు ఎలా నిర్ణయం తీసుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియారిటీ ఉన్న వారందరికీ వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. ఫోన్‌లో కమిషనర్ స్పందనతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని కోరారు. గురువారం జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి కార్మికులంతా తరలివెళ్లి తమ గోడును కౌన్సిల్ సభ్యులకు, అధికారులకు విన్నవిస్తామని కార్మికులు తెలిపారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల తరలింపు!

- మాల్తుమ్మెద నుంచి సిద్దిపేటకు..
- ఇప్పటికే సెకండియర్ విద్యార్థులను పంపించిన అధికారులు
- త్వరలో ఫస్టియర్ విద్యార్థులు కూడా..
- సరైన వసతులు లేకపోవడంతో నిర్ణయం



మాల్తుమ్మెద వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల భవనం

నాగిరెడ్డిపేట: జిల్లాలోని ఏకైక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను సిద్దిపేట జిల్లాకు తరలిస్తున్నారు. ఇప్పటికే సెకండియర్ విద్యార్థులను పంపించిన అధికారులు.. త్వరలో ఫస్టియర్ విద్యార్థులనూ పంపించడానికి సిద్ధమవుతున్నారు. తక్కువ అడ్మిషన్లు రావడం, సరైన వసతులు లేకపోవడాన్ని సాకులుగా చూపుతూ ఈ చర్యలు తీసుకుంటున్నారు.

మాల్తుమ్మెద శివారులో 2015లో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఫస్టియర్‌లో 30, సెకండియర్‌లో 30 చొప్పున సీట్లు కేటాయించారు. తర్వాత కళాశాలలోని ఒక్కో తరగతిలోని సీట్లను 30 నుంచి 20కి కుదించారు. మొదట్లో మాల్తుమ్మెద విత్తన క్షేత్ర భవనంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల తరగతులను నిర్వహించారు. తర్వాత కళాశాల కోసం ప్రత్యేకంగా నిర్మించిన నూతన భవనంలోకి మార్చారు. విద్యార్థులకు పాఠాలను బోధించేందుకు ప్రిన్సిపాల్‌తోపాటు తాత్కాలికంగా ఒక టీచింగ్ అసోసియేట్‌ను నియమించారు. తప్పనిసరైన పరిస్థితుల్లో కళాశాల పక్కనే ఉన్న డాట్ సెంటర్‌లోని అధికారులు విద్యార్థులకు క్లాసులు తీసుకుంటున్నారు. విద్యార్థులకు విత్తనోత్పత్తి క్షేత్ర భవనంలోనే హాస్టల్ వసతి ఉంది. కాగా హాస్టల్‌లో సరైన మౌలిక వసతులు లేకపోవడంతోపాటు విద్యార్థులు తక్కువ సంఖ్యలో నమోదు కావడంతో ప్రస్తుతం మాల్తుమ్మెద వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను సిద్దిపేట జిల్లా తోర్నాలలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలకు తరలిస్తున్నారు.

పరీక్షలు కాగానే ఫస్టియర్ విద్యార్థులు..

మాల్తుమ్మెద వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో సెకండియర్‌లో 13 మంది విద్యార్థులున్నారు. వీరిని గతనెలలో తోర్నాలలోని కళాశాలకు తరలించారు. ప్రస్తుతం కళాశాలలో ఫస్టియర్ విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వీరికి గురువారంనుంచి మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 7వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. పరీక్షలు ముగిసిన వెంటనే మాల్తుమ్మెద కళాశాలలోని 12 మంది ఫస్టియర్ విద్యార్థులను సైతం తోర్నాలకు తరలించాలని యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారు.

❝ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

ప్రస్తుతం కళాశాలలో ఫస్టియర్‌లో 12 మంది, సెకండియర్‌లో 13 మంది విద్యార్థులున్నారు. కళాశాలకు అనుబంధంగా సొంత హాస్టల్ భవనం లేదు. దీంతో విద్యార్థులకు విత్తన క్షేత్ర భవనంలోనే తాత్కాలికంగా హాస్టల్ వసతి కల్పించారు. తాత్కాలికంగా కేటాయించిన హాస్టల్ భవనంలో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని యూనివర్సిటీ అధికారులు ఇక్కడి విద్యార్థులను తోర్నాలకు తరలించాలని నిర్ణయించారు. ఇప్పటికే సెకండియర్ విద్యార్థులను అక్కడికి పంపించాం. త్వరలోనే ఫస్టియర్ విద్యార్థులను కూడా అక్కడికే పంపిస్తాం.

– మాధవీలత, ప్రిన్సిపాల్, మాల్తుమ్మెద వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల


నాగమడుగు నత్తనడక

- రబ్బర్‌డ్యాం ఏర్పాటుకు ప్రతిపాదనలు
- కొలిక్కిరాని భూ సేకరణ ప్రక్రియ
- మూడేళ్లలో 15 శాతం మించని పనులు


నిజాంసాగర్(జుక్కల్): మంజీర నదిపై చేపట్టిన నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. నదిలో కరకట్ట నిర్మించి ఇక్కడి నుంచి ఎత్తిపోతల ద్వారా సాగు నీటిని పిట్లం మండలానికి, అక్కడ నుంచి గ్రావిటీ ద్వారా పిట్లం, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్ మండలాల్లోని చెరువులకు నీటిని సరఫరా చేయాలనే లక్ష్యంతో పనులను ప్రారంభించారు. నిజాంసాగర్ ప్రాజెక్టు దిగువన నిజాంసాగర్ ప్రాజెక్టుతోపాటు నల్లవాగు మత్తడి, కల్యాణి, సింగితం రిజర్వాయర్ వరద నీటి ప్రవాహం కలిసే చోట మంజీర నదిపై చేపట్టిన పనుల కోసం గత ప్రభుత్వం రూ.467.25 కోట్లు మంజూరు చేసింది. జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద మండలాల్లోని 40,768 ఎకరాల నాన్‌కమాండ్ ఏరియాకు సాగు నీటి వసతి కల్పించడం నాగమడుగు ఎత్తిపోతల పథకం ముఖ్య ఉద్దేశం. పనులు ప్రారంభమై మూడేళ్లయినా ఇప్పటి వరకు 15 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

భూములు ఇచ్చేందుకు రైతుల నిరాకరణ

నాగమడుగు ఎత్తిపోతల పథకం కరకట్టతో పాటు పంపుహౌజ్‌లు, గ్రావిటీ కాలువల నిర్మాణానికి 500 ఎకరాల భూములు అవసరమని నీటిపారుదలశాఖ అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు అవసరమైన భూమిని సేకరించలేదు. ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా పరిహారం దక్కడం లేదని రైతులు తమ భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ఎకరానికి రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఒడ్డేపల్లి శివారులో మాత్రం 11.26 గుంటల భూమిని రైతుల నుంచి సేకరించగా ఎకరానికి రూ.17 లక్షల చొప్పున పరిహారం చెల్లించారు.



అర్ధంతరంగా నిలిచిన కరకట్ట నిర్మాణ పనులు



నాగమడుగు ఎత్తిపోతల పథకం నిర్మించాల్సిన ప్రాంతం

❝ ప్రతిపాదనలు పంపాం..



నాగమడుగు ఎత్తిపోతల సేఫ్టీకోసం రబ్బర్ డ్యాం నిర్మాణానికి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాం. నాన్‌కమాండ్ ఏరియాకు సాగు నీరందించడంతోపాటు రైతులకు ఇబ్బందులు లేకుండా రబ్బర్ డ్యాం నిర్మాణం చేపట్టేలా చూస్తా.

– లక్ష్మీకాంతారావు, జుక్కల్ ఎమ్మెల్యే

పనులు సాగుతున్నాయి



పంప్‌హౌస్ పనులు కొనసాగుతున్నాయి. భూ సేకరణకు రైతులు సహకరిస్తే గ్రావిటీ పనులు కుడా చేపడుతాం. ఇప్పటి వరకు 15 శాతం పనులు పూర్తి చేయడంతోపాటు రూ.40 కోట్ల బిల్లులు చెల్లించాం.

– శ్రీనివాస్, నీటిపారుదలశాఖ సీఈ

క్లుప్తంగా

మూల మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టరా?



రాజంపేట: రాజంపేట మండలం మీదుగా గుండారం, మెదక్ జిల్లాకు ప్రయాణించాలంటే ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోంది. ప్రమాదకర మలుపు వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరికి వచ్చేవరకు కనిపించకపోవడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రాజంపేట నుంచి ఆర్గొండ వరకు రెండు వరుసల రోడ్డు కావడంతో వాహనచోదకులు వేగంగా వెళ్తున్నారు. దీంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు ప్రమాదాల్లో ఎంతోమంది గాయపడి మరణించిన వారు ఉన్నారు. ఆర్అండ్బీ అధికారులు మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.రెండు రోజుల క్రితం బస్వన్నపల్లి, ఆర్గొండ గ్రామాల మధ్య కారు, ద్విచక్రవాహణం ఢీకొనడంతో ద్విచక్రవాహనదారులకు గాయాలయ్యాయి. ప్రస్తుతం వారు హైదరాబాద్లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి అర్చరీ పోటీల్లో బంగారు పతకం



సిరికొండ: సీఎం కప్ రాష్ట్రస్థాయి అర్చరీ పోటీల్లో తాళ్లరామడుగు గ్రామానికి చెందిన బాకారం రాహుల్ బంగారు పతకం సాధించాడు. ఖమ్మంలో బుధవారం జరిగిన పోటీల్లో అదే జిల్లాకు చెందిన శివసాయిపై రాహుల్ విజయం సాధించాడు. అర్చరీలో రాహుల్ బంగారు పతకం సాధించడం పట్ల మండలంలో క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

రెజ్లింగ్ పోటీల్లో..



మోపాల్: హన్మకొండ జిల్లాలో జరుగుతున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ 46 కేజీల విభాగంలో మండలంలోని మంచిప్పకు చెందిన బాదావత్ రోజా బంగారు పతకం సాధించింది. రోజాను జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిందని జిల్లా రెజ్లింగ్ కోచ్ దేవేందర్ తెలిపారు. రోజా బంగారు పతకం సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

విరగబూసిన మామిడి



సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు గ్రామ చౌరస్తా వద్ద ఉన్న మామిడి చెట్టు విరగబూసింది. కామారెడ్డి–భీంగల్ ప్రధాన రహదారి పక్కనే ఈ చెట్టు ఉంది. విరగబూసిన మామిడి చెట్టు రోడ్డు వెంబడి వెళ్లే ప్రయాణికులను కనువిందు చేస్తోంది.

విద్యాశాఖలో కదలని ఫైళ్లు!

- డీఈవో, అసిస్టెంట్ డైరెక్టర్ మధ్య వివాదం
- రెండు నెలలుగా ఆగిపోయిన ఫైళ్లు



నిజామాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖలో రెండు నెలలుగా ఫైళ్లు కదలడం లేదు. నూతనంగా జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు తీసుకున్న అశోక్, విద్యాశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్గా కొనసాగుతున్న నాగజ్యోతి మధ్య ఈ ఫైళ్ల వివాదం నెలకొంది. వివిధ విభాగాలకు సంబంధించిన ఫైళ్లను క్లియర్ చేయాల్సిన సందర్భంలో ఇద్దరు కూడా సంతకాలు చేయకపోవడంతో అవి పెండింగ్లో ఉంటున్నాయి. దీంతో పరిపాలన విభాగంలో సమస్యలు తలెత్తుతున్నాయి. అంతేగాక ప్రైవేట్ పాఠశాలల ఫైల్ నిర్వహణ సైతం అలాగే నిలిచిపోయింది.

మీరంటే.. మీరని..

డీఈవో అశోక్ నవంబర్ 5న బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం కార్యాలయానికి సంబంధించి పరిపాలన విభాగం, ప్రైవేట్ పాఠశాలలు, సర్వీస్ ఫైళ్లకు సంబంధించి పూర్తిస్థాయి అవగాహన వచ్చిన తర్వాతే పరిశీలిస్తానని ఆలోచనలో డీఈవో ఉన్నారు. అలాగే పరిపాలనలో భాగంగా అసిస్టెంట్ డైరెక్టర్ ముందుగా సంతకం చేసి తీసుకువస్తేనే తాను సంతకం చేస్తానని అంటున్నారు. మరోవైపు అసిస్టెంట్ డైరెక్టర్ నాగజ్యోతి ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు, రెన్యువల్, సర్వీస్కు సంబంధించి ఫైళ్లపై సంతకాలు చేయడం లేదు. దీంతో డీఈవో కూడా వాటిపై సంతకాలు చేయడం లేదు. ''మీరు సంతకం చేస్తేనే, నేను సంతకం చేస్తానంటూ'' ఇద్దరు అంటున్నారు. వీరిద్దరి మధ్య కొనసాగుతున్న వివాదంతో ఫైళ్లు నిలిచిపోయాయి. ఇందులో ఇప్పటికే ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి గుర్తింపు విషయంలో 18 ఫైళ్లు నిలిచిపోయాయి. మరో 12 రెన్యువల్కు సంబంధించినవి ఉన్నాయి. ఇంతేకాక సర్వీస్ మ్యాటర్కు సంబంధించిన ఫైళ్లు అలాగే ఉండిపోయాయి. ఉద్యోగులకు సంబంధించిన సర్వీస్ ఫైళ్లు ఎప్పటికప్పుడు క్లియర్ చేయాల్సి ఉండగా నెలరోజులుగా పెండింగ్లో ఉన్నాయి. దీంతో టీచర్లు, ఉద్యోగులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుతం పరీక్షల సమయం కావడంతో పరీక్షలు ఏర్పాట్లకు సంబంధించిన ఫైళ్లు కూడా కొన్ని పెండింగ్లో ఉన్నాయి.

సెలవుల్లో ఉన్న ఉద్యోగికి వేతనం

విద్యాశాఖ కార్యాలయంలోని ఓ సీనియర్ అసిస్టెంట్ మూడు నెలలు సెలవుల్లో ఉన్నా కూడా జీతం మంజూరు చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని ఓ అధికారి ఇలా సెలవులో ఉన్న వేతనాలు మంజూరు చేయడం జరిగింది. దీనిపై విచారణ చేస్తామన్నా.. ఇప్పటికీ ముందడుగు పడటం లేదు. ప్రస్తుతం వివిధ విభాగాలతో సంబంధించిన ఫైళ్లను క్లియర్ చేయడంలో నువ్వా నేనా అనుకునే అధికారులు ఓ సీనియర్ అసిస్టెంట్కు ఏకంగా మూడు నెలల జీతాన్ని ఎలా మంజూరు చేశారని పలువురు చర్చించుకుంటున్నారు.

ఆన్లైన్ చేయాల్సి ఉంది

కొన్ని ఫైళ్లను మండల విద్యాశాఖ కార్యాలయాల్లో ఆన్లైన్ చేయాల్సి ఉంది. అందుకే నిలిచిపోయాయి. వీటిని క్లియర్ చేయిస్తాను. కార్యాలయంలో పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయాలని ఏడీని ఆదేశించాం. – అశోక్, డీఈవో

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ను ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నేతలు

కామారెడ్డి అర్బన్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) కొత్త సంవత్సరం క్యాలెండర్ను బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు విజయ రామరాజు, ఎస్సీ ప్రభాకర్, బి.దేవులా, సరోజినీ, గంగారాం, శ్యాం కుమార్, శ్రీకాంత్, గఫార్, సత్యం పాల్గొన్నారు.

తపస్ క్యాలెండర్..



క్యాలెండర్ను ఆవిష్కరిస్తున్న డీఈవో ఎస్.రాజు

కామారెడ్డి టౌన్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) నూతన సంవత్సర క్యాలెండర్ను డీఈవో ఎస్.రాజు చేతుల మీదుగా బుధవారం డీఈవో కార్యాలయంలో ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు పుల్గం రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి భునేకర్ సంతోష్, నాయకులు ఆంజనేయులు, సత్యనారాయణ, భాస్కర్, షషిధర్, పవన్ కుమార్, శ్యాం గౌడ్, వేద ప్రకాశ్, కిష్టయ్య, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

శివాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..



క్యాలెండర్ను ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బీబీపేట: మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పెరమాండ్ల చేతుల మీదుగా బుధవారం నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఫౌండేషన్ చేస్తున్నటువంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను అందులో పొందుపరుస్తూ క్యాలెండర్ను రూపొందించారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి సింగిల్ విండోకు సంబంధించిన క్యాలెండర్ను బుధవారం ఎమ్మెల్యే మదన్ మోహన్రావు ఆవిష్కరించారు. విండో చైర్మన్ సదాశివరెడ్డి, వైస్ చైర్మన్ పశుపతి, నాయకులు ఇర్షాదొద్దిన్,బత్తుల రాములు,సంతోష్ రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



సుభాష్నగర్: మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్రెడ్డిని ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్రెడ్డి బుధవారం హైదరాబాద్లో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లాలో రుణమాఫీ, పంట, దీర్ఘకాలిక రుణాలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రూ.2వేల కోట్ల వ్యాపారాన్ని అధిగమించిన విషయాన్ని బ్యాంకు చైర్మన్ రమేష్రెడ్డి సుదర్శన్రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. బ్యాంకుకు పూర్వవైభవం తీసుకురావాలని, ఎన్పీఏ విషయంలో కఠినంగా వ్యవహరించాలని సుదర్శన్రెడ్డి ఆయనకు సూచించారు.

కాంగ్రెస్ను విమర్శిస్తే ఊరుకోం



నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ను విమర్శిస్తే ఇకపై ఊరుకోమని నుడా చైర్మన్ కేశ వేణు అన్నారు. నగరంలోని కాంగ్రెస్ భవన్లో బుధవారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్ను విమర్శించే ముందు జిల్లాకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. అధికారం పోయినా ఏడాదికి ఆమె జిల్లాకు వచ్చారన్నారు. కవిత లిక్కర్ స్కాం కేసులో బెయిల్పై ఉన్న విషయం గుర్తుంచుకోవాలని ఎద్దేవా చేశారు. జిల్లాకు చుట్టపు చూపుగా రావడం తప్ప ఆమె చేసిందేమీ లేదన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీపై అనవసర విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ఎంపీగా రెండుసార్లు గెలిచిన అర్వింద్ కేంద్రం నుంచి నిధులు ఎందుకు తేవడం లేదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో మేయర్ పీఠం కాంగ్రెస్దేనన్నారు.

నగర అభివృద్ధికి రూ.60 కోట్లు

నూతన సంవత్సర కానుకగా రాష్ట్ర ప్రభుత్వం నిజామాబాద్ నగర అభివృద్ధికి రూ.60 కోట్లు మంజూరు చేసిందని కేశ వేణు తెలిపారు. డివిజన్కు రూ.కోటి చొప్పున నిధులు కేటాయించాన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం వీటిని వినియోగించాలని సూచించారు. అమృత్ పథకం కింద బల్దియాకు రూ.460 కోట్లు వచ్చాయన్నారు. నాయకులు మహ్మద్ ఖుద్దూస్, గడుగు రోహిత్, జావేద్ అక్రం, ఆరూన్ ఖాన్, పంచరెడ్డి సూరి, రాజ నరేందర్ గౌడ్, అపర్ణ తదితరులున్నారు.

ఆలయ భూమి కబ్జా!

- కాంగ్రెస్ నేతల హస్తం
- అధికారుల చుట్టూ తిరుగుతున్న బాధితులు



కబ్జాకు గురైన భూమిని చూపుతున్న యజమానులు(ఫైల్)

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ మండలం ఆకుల కొండూర్ గ్రామంలో గల నల్ల పోచమ్మ ఆలయ భూములు కబ్జాకు గురయ్యాయి. గ్రామానికి చెందిన మణెమ్మ కుటుంబ సభ్యులకు 199 సర్వే నంబర్లో 12 ఎకరాల 11 గుంటల భూమి ఉండేది. ఆ భూమిని ఇతరులకు విక్రయించారు. అందులోని 38 గుంటల భూమిని నల్లపోచమ్మ ఆలయం కోసం వదిలేశారు. అయితే రికార్డులలో మాత్రం వారి పేరు ఉండేది. కాగా ఆ భూమిని ప్రస్తుతం అధికార పార్టీలో ఉన్న నేతలు కబ్జా చేశారు. 2016 వరకు వారి పేరు మీద ఉన్న భూములు ప్రస్తుతం ఇతరుల పేర్ల మీదకు మారాయి. ఆలయ భూముల కబ్జాపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే కబ్జా విషయమై గ్రామస్తులు ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. కానీ ఇంతవరకు న్యాయం జరగలేదు.

పట్టించుకోని అధికారులు

కొండూర్లో 38 గుంటల భూమి కబ్జా విషయంపై అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన ఫలితం లేకుండా పోతుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన బడా నాయకులే కబ్జాలు చేశారని ఆరోపిస్తున్నారు. గతంలో అధికారులతో కుమ్మక్కై రికార్డులు తారుమారు చేసి, భూమి కబ్జా చేశారని వాపోతున్నారు.

చర్యలు తీసుకోవాలి

భూమి కబ్జా విషయమై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. సమస్యను స్థానిక ఎమ్మెల్యే వద్దకు తీసుకెళ్లాం. స్థానికంగా సమస్య పరిష్కారం కాకుంటే రెవెన్యూ మంత్రిని, సీఎం రేవంత్రెడ్డిని కలిసి ఉద్యమిస్తాం. – అగ్గు భోజన్న, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు

'ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం'



జిల్లా కేంద్రంలోని ఇందిరాచౌక్లో విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రోడ్ల మీదకి వచ్చి ఇన్ని రోజులుగా నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం, సీఎం స్పందించకపోవడం బాధాకరమని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు వాసంతి అన్నారు. సమ్మె చేస్తున్న సమయంలో ఇప్పటికే ఇద్దరు ఉద్యోగులు మరణించారని, అలాగే తాజాగా సిద్దిపేట జిల్లాలో సమ్మెలో ఉన్న మహిళా ఉద్యోగికి గుండెపోటు వచ్చి ఆస్పత్రి పాలైందని, ఆమెకు ఏదైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె బుధవారంతో 23వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా పాత బస్టాండ్ వరకు వెళ్లి అక్కడ ఇందిరాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. తక్షణమే ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసి న్యాయం చేయాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, నాయకులు శ్రీధర్, రాములు, కాళిదాసు, శైలజ, సంతోష్ రెడ్డి, వీణ, వనజ, మంగా, శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు దిగిన సివిల్ సప్లయ్ హమాలీలు



కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మెలో కూర్చున్న హమాలీలు



బాన్సువాడలో..



పిట్లంలో..

సాక్షి నెట్వర్క్: తమ డిమాండ్లను నెరవేర్చాలని ఏఐటీయూసీ అనుబంధ సివిల్ సప్లయ్ హమాలీలు బుధవారం నిరవధిక సమ్మెకు దిగారు. బాన్సువాడ, పిట్లం, బిచ్కుంద, ఎల్లారెడ్డి, కామారెడ్డిలలో దీక్షలను ప్రారంభించారు. హమాలీల సంఘం నేతలు మాట్లాడుతూ.. హమాలీలకు ప్రభుత్వం పెంచిన ఎగుమతి, దిగుమతి క్వింటాలుకు రూ.29 కూలీల రేటును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఏడు సివిల్ సప్లయ్ గోదాంలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. పలువురు మద్దతు తెలిపారు.



బిచ్కుందలో ..



ఎల్లారెడ్డిలో ..

విషాహారంతో 50 కోళ్లు మృతి

- డొంకేశ్వర్ మండలం గంగాసముందర్లో విష ప్రయోగం



విషాహారం తిని మృతి చెందిన నాటు కోళ్లు, మేకపిల్లను పరిశీలిస్తున్న గ్రామస్తులు



విషం కలిపిన బియ్యం

డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం గంగాసముందర్ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు నాటు కోళ్లపై విష ప్రయోగం చేశారు. విషం కలిపిన బియ్యం తిని 50 పైగా కోళ్లు, ఒక మేక మృతి చెందాయి. మోతె చిన్న సాయన్న, చాకలి రాజన్నలకు చెందిన కోళ్లు భారీ సంఖ్యతో మరణించాయి. గొల్ల సాయిలుకు చెందిన ఒక మేక పిల్ల కూడా చనిపోయింది. కావాలనే కోళ్లపై విష ప్రయోగం చేశారని కోళ్ల పెంపకం దార్లు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ఇలాగే చేశారని, వారిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. సుమారు రూ.50వేల నష్టం జరిగిందని వాపోయారు. కోళ్లు, మేకపిల్ల మృతి చెందిన ఘటనపై మండల పశువైద్య అధికారి శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం గ్రామానికి వచ్చి చనిపోయిన కోళ్లను పరిశీలించి అవసరమైతే పరీక్ష చేసేందుకు ల్యాబ్కు పంపుతామని అధికారి తెలిపారు.

బోధన్ ఎంఐఎం టౌన్ కమిటీ రద్దు

ఖలీల్వాడి: ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాద్ ముస్లమిన్ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు బోధన్ ఎంఐఎం టౌన్ కమిటీని రద్దు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఫయాజుద్దీన్ బుధవారం తెలిపారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ఎంఐఎం ముహమ్మద్ షకీల్ అహ్మద్ ఫాజిల్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ షాబాజ్ అహ్మద్తో కలిసి బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆలయన మాట్లాడారు. ఓవైసీ, మజ్లిస్ జిల్లా సంస్థాగత వ్యవహారాల ఇన్చార్జి, మలక్పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బిలాల సలహా మేరకు త్వరలో బోధన్ ఎంఐఎం బాడీ ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు బోధన్లో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు ప్రజల్లో ఉంటూ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల నలుగురి మృతి

ఉమ్మడి జిల్లాలో బుధవారం నలుగురు మృతి చెందారు. చేపల వేటకు వెళ్లి ఒకరు, రోడ్డు ప్రమాదంలో మరొకరు చనిపోయారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ ఇద్దరు చికిత్స పొందుతూ మరణించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిజాంసాగర్: చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన మహమ్మద్ నగర్ మండలం కోమలంచ గ్రామ శివారులోని మంజీర నదిలో చోటు చేసుకుంది. ఎస్సై శివకుమార్ కథనం ప్రకారం.. బాన్సువాడ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన గుట్ట సాయిలు(35) చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం కొమలంచ శివారులోని మంజీర నదిలో చేపలు వేటాడుతుండగా తెప్పపై నీటిలో పడ్డాడు. సాయిలు రెండు కాళ్లకు వల చిక్కుకోవడంతో నీటమునిగి మృతి చెందాడు. మృతుడి సోదరుడు బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

అడవి పందులను ఢీకొని ఒకరు..

ఎల్లారెడ్డి: అడవి పందులను బైక్ ఢీకొని ఒకరు మృతి చెందారు. ఎల్లారెడ్డి మండలం మత్తమాల గ్రామానికి చెందిన మైసాగౌడ్(52), పద్మా భార్యభర్తలు. వీరు బైక్పై వస్తుండగా గ్రామ శివారులో అడవి పందులను బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని ఆస్పత్రికి తరలిస్తుండగా మైసాగౌడ్ మృతి చెందాడు. పద్మ చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

నిజాంసాగర్: జుక్కల్ మండలం మధుర తండాకు చెందిన చావన్ హరియాన్ బాయి (56) నిజామాబాద్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై భువనేశ్వర్ తెలిపారు. తండాకు చెందిన చావన్ మోహన్ తన తల్లి హరియన్ బాయితో కలిసి బైక్పై వెళ్తుండగా గత నెల 26న శ్రీనగర్ సమీపంలోని కోళ్లఫారం వద్ద ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొంది. గాయపడ్డ మోహన్, హరియాన్బాయిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలి భర్త నందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మచ్చర్లకు చెందిన వ్యక్తి..

నవీపేట: మండలంలోని గాంధీనగర్ సమీపంలో గత నెల 27న జరిగిన ప్రమాదంలో గాయపడిన ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన కమ్మరి కాంతారావు(49) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై వినయ్ తెలిపిన వివరాలు.. నవీపేట నుంచి నందిపేట వైపు ఆటోలో వెళ్తుండగా డ్రైవర్ అఫ్సర్ నిర్లక్ష్యంగా ఆటోను నడపడంతో కాంతారావు కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన కాంతారావును చికిత్స నిమిత్తం హైదరాబాద్కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

హత్య చేస్తారన్న భయంతో ఆత్మహత్య

నస్రుల్లాబాద్: హత్య చేస్తామని బెదిరించడంతో భయపడి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని దుర్కి గ్రామానికి చెందిన సంతోష్ (23)ను అదే గ్రామా నికి చెందిన దుర్గం సూరి, అతని భార్య అమని, దుర్గం సంజీవ్ బెదిరించారు. దీంతో భయపడ్డ సంతోష్ డిసెంబర్ 18న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు ఎస్సై లావణ్య తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరు..

నస్రుల్లాబాద్: మండలంలోని దుర్కి శివారులో గల పొలంలో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. బాన్సువాడ మండలం సోమేశ్వర్ గ్రామానికి చెందిన షేక్ గౌస్(45) జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. గౌస్ భార్య పిల్లలను తీసుకుని 15 ఏళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ఒంటరి తనంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు.

మృతుడి సోదరుడు షాబోద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లావణ్య పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

నవీపేట: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఇసుక టిప్పర్ను పట్టుకున్నట్లు ఎస్సై వినయ్ బుధవారం తెలిపారు. రెంజల్ మండలం బోర్గాం గ్రామానికి చెందిన నవీద్కు చెందిన టిప్పర్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని సమాచారం రావడంతో పట్టుకున్నామన్నారు. వాహనాన్ని సీజ్ చేసి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు అప్పగించామన్నారు.

రావుట్లలో వడ్ల బస్తాల చోరీ

సిరికొండ: మండలంలోని రావుట్ల గ్రామంలో గంగారెడ్డి అనే వ్యక్తికి చెందిన 12 సంచుల వడ్లు చోరీ జరిగినట్లు ఎస్సై రామ్ బుధవారం తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కేసులో డీబీ తండాకు చెందిన ఇద్దరు మైనర్లను నిందితులుగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. కాగా వడ్ల సంచులను కొంత మంది కారులో తరలించి భీంగల్లోని ఒక రైస్ మిల్లులో విక్రయించినట్లు సీసీ పుటేజీ ద్వారా గుర్తించినట్లు బాధితుడు తెలిపారు.

నాలుగు డ్రంకన్ డ్రైవ్ కేసులు

మోపాల్: నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రంలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్లో నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు.